కథ

# ఇసుక తైలం

సమ్మెట ఉమాదేవి
98494 06722

మనుష్య సంచారం పెద్దగా లేని డొంకదారి గుండా.. అనుపమ ఆటో ప్రయాణం సాగుతున్నది.

లేచిన దగ్గరనుంచీ ఇంట్లో అందరికీ అన్నీ సమకూర్చి, డ్యూటీకి సిద్ధమై వచ్చిన అలసట తీరేలా, పచ్చనాకులు ఇచ్చే ప్రాణవాయువును గుండె నిండుగా పీల్చుకున్నది. సరిహద్దు సైనికుల్లా నిలిచిన కొండలను, ఆకాశపు ఒడిలో ఆడుకునే మేఘబాలలను, పంటపొలాల్లో శ్రమిస్తున్న రైతు నేస్తాలను, ప్రశాంతంగా మేత మేస్తున్న పశువులను, అక్కడక్కడా విరబూసిన రకరకాల పూలను ఆసక్తిగా గమనిస్తూ ఆ అడవి దారిలో చేసే పదిమైళ్ల ప్రయాణం.. అనుపమను ఎంతో ఆహ్లాదపరుస్తుంటుంది.

కాస్త జోరుగా ఆటోను నడిపిస్తున్న రాజుతో..

''ఏంటి రాజూ.. వసంత ఫోన్ చేసిందా ఏంటి?'' అని అడిగింది.

''అవును మేడమ్. ఫస్ట్ వచ్చింది గదా! సహారా కన్సల్టెన్సీకి బోయిన. జీతం పైసలు బంపిన్రు. వసంతతో మాట్లాడిపించిండ్రు. నెలరోజులకు నా భార్యతో మాట్లాడిన్నని సంతోషపడుదునా.. దాని ఏడ్పు జూసి నేను సుత ఏడుద్దునా సమజైతలే మేడమ్!'' బాధపడ్తూ అన్నాడు రాజు.

నిత్యం ఆ దారిలో.. అనుపమతో తన కుటుంబపు సంగతులెన్నో పంచుకుంటుంటాడు రాజు. ఆర్థిక సమస్యల వల్ల వసంతను కుయ్యేట్‌కు పంపించాడేగానీ.. ఆమెను విడిచి ఉండలేకపోతున్న బెంగ, అంతదూరం పంపించి తప్పు చేశానేమోనన్న అపరాధ భావపు సంఘర్షణను అనుపమతో వెళ్లబోసుకుంటూనే ఉంటాడతను.

''ఒకసారి మా తమ్మునికి జబ్బు జేసిందని బొజ్జాయి గూడెంల సమ్మక్క సారలక్క గద్దెల కాడ.. వానెత్తు బంగారం (బెల్లం) తూస్తనని మా అమ్మ మొక్కుకున్నది మేడమ్. మా తమ్ముని మొక్కు చెల్లించుకుంటాంటే.. ఆడ, వాళ్ల దోస్తులకు కొబ్బరిముక్కలు, బంగారం బంచుతున్న వసంతను జూసిన. బంగారమోలే ఉన్నదనుకున్న. ఇగ లవ్వు గిట్ల ఏమీ లేదుగానీ మేడమ్. అనుకోకుంట ఆ పక్కూర్లో పిల్లను జూస్తానికి బోయి స్టన్ అయిన. ఎందుకంటే.. ఆడ పెండ్లిపిల్ల గా వసంతనే. వాళ్లు మా దోస్త్ నారాయణకు చుట్టాలేనంట. నేను వసంతను మొదాలే సమ్మక్క జాతరల జూసిన్నని, ఆమె నాకు మస్తు నచ్చిందని వాళ్ల పెద్దోళ్లకు చెప్పలే. మొదాలు వాళ్లు నా గురించి ఏమంటారా అని మస్త్ టెన్షన్ వడ్డ మేడమ్.

అనుకున్నట్టే.. 'రాజూ! మీది పెద్ద కుటుంబమని వసంత వాళ్ల అమ్మానాయినలు నీతో పెండ్లి వొద్దని అనుకుంటున్నర్రా.. వాళ్లు గా పిల్లను నీకిచ్చి పెండ్లి జేసేటట్టేం గనిపిస్తలేదురా' అని నారాయణ జెప్పిండు. గా మాటలకు మస్తు పరేషానైన. ఇగ గిట్ల గాదని వాణ్నే బతిలాడుకుని, వసంత ఇంటికి బంపి.. వాని ఫోన్లనించి నేనే వసంతతో మాట్లాడిన. 'వసంతా! నాకిద్దరు చెల్లెళ్లు, ఒక తమ్ముడున్నది నిజమే. ఉన్న చిన్న ఇల్లుదప్ప భూమి, బంగారం ఏమీ లేదు. లేనివి ఉన్నట్టు నేనేమీ అబద్ధం జెప్పుతలే. గరీబ్ గాళ్లమని, పెద్ద కుటుంబమని మీవోళ్లు పిల్లను ఇయ్యనీకి భయపడ్తున్నరని దెల్సింది. నువ్వు ఎట్లన్నజేసి మీ వోళ్లను ఒప్పిస్తే.. నేనైతే నిన్ను మంచిగ జూసుకుంట. గంతవరకైతే మాటిస్తున్నా. నువ్వేం పరేషాన్ గాకు. మీరు కూడా నాకు కట్నం గిట్నం ఇచ్చుడు అవుసరమే లేదు. జర మావోళ్లకు బట్టలు బెట్టి పెండ్లి మంచిగ జేయుండ్రి. మా వోళ్లకు నేను జెప్పుకొనేది నేను జెప్పుకొంటా. మీ వోళ్లకు నువ్వు జెప్పుకో! ఇగ నేను గిట్ట.. నీకు సుత నచ్చకుంటే జేసేదేం లేదు. గీ జన్మకి గింతే అనుకుంటా' అన్న మేడమ్. ఆమె ఏమీ బదులు జెప్పలేదు. వారం దినాలు పిచ్చోడి తీరుగా ఎదురుజూసిన. తరువాత దెల్సింది. బువ్వ గూడ దినకుండ.. కుద్దుగా రాజునే జేసుకుంటనని జిద్దు జేసి వాళ్లను ఒప్పించిందని. ఎంత మురిసిపోయిన్నో!''..

రాజు తన గుండెల్లో వసంత పట్ల ఉన్న ప్రేమనంతా చెప్పుకొన్నాడు.

''అస్సలు నాకూ గట్ల కుయ్యేట్ బంపనీకి ఇష్టమే లేకుండే మేడమ్. వచ్చిన పైసల్ కిరాయికి దెచ్చుకున్న ఆటోకి గట్టనీకి, ఇంట్లోకి తిండిగింజలకే సరిపోతాంటే.. ఇగ చెల్లెళ్ల పెండ్లిళ్లు ఎట్లా జేస్త.. తమ్మున్ని, మా పిల్లగాళ్లను ఎట్ల సదివిపిస్తనన్న రంధి వట్టుకున్నది నాకు. ఇగ ఎనకనుంచి మా అమ్మేమో.. 'కుయ్యేట్ల సుత.. ఇంటిపని జేసుడే గదా! మస్తు పైసలొస్తయంట. నీ పెండ్లాన్ని కువైటుకు బంపు!' అని సతాయించవట్టె. నేనైతే బంగ్లాలూ, బిల్డింగ్‌లు కట్టకున్నా.. మా చెల్లెళ్ల పెండ్లిళ్లు జేయాల్ననీ, తమ్మున్ని, నా బిడ్డలను మంచిగ చదివించాల్ననీ జర పైసలకు ఆశవడిన. వసంత సుత పాపం.. 'రెండేండ్లు కండ్లు మూసుకుంటే అన్నీ సక్కబడ్తయి గదా!' అనుకున్నది. గుండెను బండ జేసుకుని బండ చాకిరీ జేసేటందుకు బయలెల్లింది''..

ఆర్థిక పరిస్థితులు, ఆశలూ వాళ్ల జీవితాన్ని ఎట్లా మలుపు తిప్పినాయో.. రాజు చెప్తుంటే మౌనంగా వింటుండేది అనుపమ.

''ఆడీడ దెచ్చి ఏజెంట్‌కు లక్ష రూపాయలు గట్టి.. జర ధైర్నంజేసి వసంతను బంపిన.



'ఊకె రందివడకు రాజూ! ఇసుక నుంచి తైలందీసే పైసల్‌గల్ల మారాజులు ఆళ్లు. ఆళ్లకు పనులు జేసేటోళ్లు గావాల. జరంత కష్టబడ్తే ముట్టే తైలం మనకు గావాల. అందుకే మనోళ్లు మస్తు మంది ఆడికి బోతున్నారు. నువ్విచ్చిన